క్లుప్తంగా

వీఓఏలపై ఒత్తిడి తగదు


మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

కర్నూలు(సెంట్రల్): చేయూత మహిళా మార్టులలో సరుకులు కొనుగోలు చేయించాలని వీఓఏలపై ఒత్తిడి చేయడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన వీఓఏల సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుంకన్న, గుంటెప్పలతో కలసి ఆయన మాట్లాడారు. పొదుపు గ్రూపులకు రుణాలు ఇప్పించే బాధ్యత వీఓఏలదన్నారు. వీఓఏల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10,11 తేదీల్లో జరుగు 36 గంటల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముస్లిం మైనార్టీల హామీలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ షరీఫ్

కర్నూలు(సెంట్రల్) : ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అవాజ్ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, మహ్మద్ షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అవాజ్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉర్దూ యూనివర్సిటీకి పక్కా భవనాలు నిర్మించి అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. వెంటనే మైనార్టీ బ్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. వైఎస్ఆర్ షాదీ తోఫాలో నిబంధనలను సవరించాలన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు(సెంట్రల్): బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప విమర్శించారు. ఆదివారం ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కార్మికవర్గం ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 44 లేబర్ చట్టాలను కేంద్రం తుంగలోకి తొక్కుతోందన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేయడం అన్యాయమన్నారు. దేశ సంపదను కార్పొరేటర్లకు దోచి పెడతున్న మోదీ...కార్మికుల వ్యథలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

పోలీసు నియామకాల్లో ఎస్వీఆర్ ప్రతిభ


ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎస్.వెంకట్రామిరెడ్డి

కర్నూలు సిటీ: ఇటీవలే ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామకాల్లో కర్నూలు ఎస్వీఆర్ కోచింగ్ సెంటర్ అభ్యర్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్. వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన 22 మంది ఏపీ అభ్యర్థులు పోలీసు ఉద్యోగాలు సాధించడంతో ఆదివారం కోచింగ్ సెంటర్‌లో అభినందన సభ నిర్వహించి మాట్లాడారు. తమ కోచింగ్ సెంటర్‌లో అనుభవం ఉన్న ఫ్యాకల్టీతో శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. దీంతో పలువురు పోలీసు ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లారీలు పట్టివేత


మైనింగ్ అధికారులు సీజ్ చేసిన లారీ

కర్నూలు (న్యూసిటీ) : అనుమతులు లేకుండా పత్తికొండ వద్ద మూడు లారీల్లో నాపరాయి, ప్యాపిలి దగ్గర ఓ లారీలో డోలమైట్ చిప్స్ తరలిస్తుండగా శనివారం అర్ధరాత్రి తనిఖీ చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి లైసెన్స్ లేకుండా అక్రమార్కులు నాపరాయి, డోలమైట్ చిప్స్‌ను రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని చెప్పారు. పత్తికొండలో పట్టుకున్న మూడు లారీలను బస్టాండ్‌లో, ప్యాపిలిలో స్వాధీనం చేసుకున్న లారీని పోలీసుస్టేషన్‌లో ఉంచినట్లు వెల్లడించారు. వాహన యజమానులపై కేసు నమోదు చేసి రూ.1.66 లక్షలు జరిమానా విధించామని చెప్పారు. తనిఖీల్లో విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

ఈట్ స్ట్రీట్ సందడి


సందర్శకులతో కళకళలాడుతున్న ఈట్ స్ట్రీట్


సరదాగా వాటర్ ఫౌంటెన్ వద్ద ఫొటోలు తీసుకుంటూ..

కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బిర్లా గేట్ సమీపంలోని ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేసిన ఈట్‌స్ట్రీట్ (ఖానా–ఖజానా)లో ఆదివారం సందడి కనిపించింది. నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచేందుకు, రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ఇందులో పలు స్టాళ్లను ఏర్పాటు చేశారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆట వస్తువులు ఉంచారు. ఆదివారం సెలవు రోజు కావడంతో కుటుంబాలతో వచ్చిన ప్రజలు ఈట్ స్ట్రీట్‌లో ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



ఆహార పదార్థాలు ఆరగిస్తూ...


వినోదాన్ని వీక్షిస్తూ..


చిన్నారుల ఆటవిడుపు..

29 గుంటూరులో దూదేకుల సింహగర్జన


చలో గుంటూరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నూర్‌బాష దూదేకుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు

కర్నూలు: గుంటూరులో ఈ నెల 29వ తేదీన దూదేకుల సింహగర్జన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు. ఆదివారం కర్నూలులోని నూర్‌బాషా జిల్లా కార్యాలయంలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం మస్తాన్ వలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌బాషా మాట్లాడుతూ నూర్‌బాష దూదేకుల ముస్లింలు ఐకమత్యంతో ఉండి ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇమాం కాశీం ఆధ్వర్యంలో గూడూరు మండలం నూర్‌బాషా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లీబాషా, ఉపాధ్యక్షుడిగా పింజరి చిన్నబాషా, కార్యదర్శులుగా సిద్దయ్య, దూదేకుల ఇస్మాయిల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మస్తాన్‌వలి, కోశాధికారిగా దూదేకుల షాకీర్ బాషా, ఉప కోశాధికారిగా అక్బర్ బాషా, నూర్ బాషా, మీడియా ఇన్‌చార్జ్‌గా అబ్దుల్ రజాక్, వర్కింగ్ అధ్యక్షుడిగా బడే సాహెబ్, కమిటీ మెంబర్లుగా నడిపి బడే సాహెబ్, మహబూబ్‌బాషా, అమీర్‌బాషా, చిన్నబడే సాహెబ్, హుస్సేన్‌బాషా, హాజీ వలి, నాగూర్ వలి లను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ తమ మీద నమ్మకంతో పదవులు కట్టబెట్టినందుకు గూడూరు నూర్‌బాష సంఘాన్ని బలోపేతం చేసి సంఘం అభివృద్ధికి పాటుపడతామని వారు తెలియజేశారు.

మునిసిపల్ కమిషనర్ తీరు సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): తొలగించిన క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలంటే కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజ విధించిన నిబంధనలు బాధాకరం కలిగిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.నిర్మల అన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో క్లాప్ ఆటో డ్రైవర్లకు కమిషనర్ ఇచ్చిన నిబంధనల చార్టుపై కార్మిక సంఘ నాయకులు చర్చించారు. జీతం ఇచ్చినప్పుడు తీసుకోవాలని, అంతవరకు అడగకూడదని చెప్పడం అన్యాయమన్నారు. నెలకు జీతం రాకపోతే వారి కుటుంబం ఏ విధంగా ఇబ్బంది పడుతుందన్న ఆలోచన లేకుండా కమిషనర్ వెట్టిచాకిరి చేయించుకునేలా నిబంధనలు రూపొందించి కార్మికులతో సంతకాలు తీసుకొని పని చేయించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు ఇప్పించి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, నాయకులు విజయ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వెంకటరమణయ్య సేవలు చిరస్మరణీయం


ముచ్చుకోట వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూసిటీ) : గ్రంథాలయ ఉద్యమంలో ముచ్చుకోట వెంకటరమణయ్య అందించిన సేవ లు చిరస్మరణీయమని జీఎస్ఆర్‌కే శర్మ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పింగళి సూరన్న తెలుగు తోటలో గ్రంథాలయ తాతయ్య వెంకటరమణయ్య జయంతి ఉత్సవ సభ జరిగింది. కావెం సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జీఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ వెంకటరమణయ్య తెలుగు, సంస్కృతం భాషల్లో పండితులని కొనియాడారు. శతవధాని డాక్టర్ ఆముదాల మురళి మహాభారతం సభాపర్వం గురించి ప్రసంగించారు. అంతకుముందు ముచ్చుకోట వెంకటరమణయ్య, మేడూరు దీక్షితులు వెంకటసుబ్బయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయకుమారి, డాక్టర్ పార్వతి, లక్ష్మయ్య, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, డాక్టర్ వి.పోతన్న, ఎలమర్తి రమణయ్య, సూర్యశ్రీ చంద్రమౌళి, సవ్వప్ప, ఈరన్న, ఓర్వకల్లు సంజీవరెడ్డి, డాక్టర్ రమణయ్య, సయ్యద్ జహీర్, మల్లు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అంధత్వాన్ని ఆత్మవిశ్వాసంతో జయించాలి


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): అంధత్వాన్ని ఆత్మవిశ్వాసంతో జయించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. నగర సమీపంలోని పసుపుల రోడ్డులో ఉన్న అక్షిత అంధుల పాఠశాల విద్యార్థులకు ఆదివారం ఆయన తన వంతుగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి పంచేంద్రియాల్లో అంధత్వమున్న వారు బాధపడాల్సిన అవసరం లేదని, ఆత్మవిశ్వాసంతో దానిని జయించి అందరికీ ఆదర్శంగా నిలిచిన వారు ఎంతో మంది ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు సుధాకర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

దంతాలను పటిష్టంగా ఉంచుకోవాలి



పిల్లల దంతాలను పరీక్షిస్తున్న డాక్టర్ సాబీ రహ్మద్

కర్నూలు(హాస్పిటల్): దంత వైద్యపరీక్షలు తరచూ చేయించుకుంటూ వాటిని పటిష్టంగా ఉంచుకోవాలని లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సారా డెంటల్ క్లినిక్, సీఆర్ఆర్ ఎంఎం మున్సిపల్ పాఠశాల స్కూల్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏపీఎస్‌పీ క్యాంపు ఆవరణలోని కట్టమంచి రామలింగారెడ్డి మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన చిన్నారులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి పేస్టులు, బ్రష్‌లు, మౌత్‌వాష్‌లు, మందులు పంపిణీ చేశారు. అనంతరం రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల దంత సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులదేనని చెప్పారు. దంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. దంత సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దంత వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నోటి క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ సాబీరహ్మద్, డెంటల్ సర్జన్ డాక్టర్ బి. సాయిశృతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. వెంకటరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్.మాబాషా, సభ్యులు ఎస్. కరీముల్లా, ఎన్.వేణు, డి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు నివాళి


వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న సుభాష్, తదితరులు

కర్నూలు(అర్బన్): స్వాతంత్య్ర ఉద్యమంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధ్యక్షుడిగా వడ్డె ఓబన్న చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు అడుగులు వేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బత్తుల లక్ష్మీకాంతయ్య ఆధ్వర్యంలో స్థానిక బీసీ భవన్‌లోని ఓబన్న విగ్రహానికి బీసీ, ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో వడ్డె ఓబన్న చూపించిన తెగువ, పోరాటాలను నేటి తరానికి తెలియజెప్పాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ విభాగం కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, నాయకులు అయ్యన్నయాదవ్, చంద్రికమ్మ, వెంకట్రాముడు, బ్రహ్మయ్య ఆచారి, వడ్డెర సర్వేష్‌బాబు, శ్రీరాములు యాదవ్, కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పురావస్తు కట్టడాలను కాపాడాలి

కర్నూలు కల్చరల్: పురావస్తు శాఖ కట్టడాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ వినతి పత్రం అందజేశారు. విజయవాడలో జరిగిన బీజేపీ సోషల్ మీడియా వలంటీర్స్ సమావేశానికి హాజరైన ఆమెకు జిల్లాలోని పురావస్తు కట్టడాలు, ఆక్రమణల గురించి వినతి పత్రం అందజేశారు.

హరినామ సంకీర్తనతో ప్రశాంతత

కర్నూలు కల్చరల్: హరినామ సంకీర్తన జపంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ నిత్యం భగవద్గీతను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఉత్తమ జీవిత గమనానికి మార్గదర్శకంగా ఉంటుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ మంత్రాన్ని జపం చేయించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడాలి


మాట్లాడుతున్న వి.గిరికుమార్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంఘటితమై పోరాటాలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ వి.గిరికుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాజన సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథులుగా వి.గిరికుమార్‌రెడ్డి, ఏపీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి అల్లం సురేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ వేతనంతో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. అల్లం సురేష్‌బాబు మాట్లాడుతూ..అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలన్నారు. అనంతరం నూతనంగా రెండు జిల్లాలకు రెండు కమిటీలను ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, రాముడు, నాగరాజు, దాసన్న, శుభనాయక్, అమిదాబీ, నెల్లూ రు జిల్లా జేఏసీ కార్యదర్శి రాజేష్, అన్నమయ్య జిల్లా జేఏసీ చైర్మన్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం ఆచరణీయం


మాట్లాడుతున్న ఖాజీ సయ్యద్ సలీం బాషా

కర్నూలు కల్చరల్: మహమ్మద్ ప్రవక్త నడిచిన మార్గం ఎంతో ఆచరణీయమని ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సలీంబాషా అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక సంతోష్‌నగర్‌లోని నూరుల్ హుదా మదరసా మసీదులో ఈద్ మిలాద్ జల్సా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా సూచించిన మార్గంలో నడవాలని ప్రవక్త బోధించారని చెప్పారు. ఇస్లాం శాంతి సర్వ మానవాళి మేలును కోరుకుంటుందన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు సయ్యద్ నూరుల్లా ఖాద్రి, సయ్యద్ ఖైరుల్లా ఖాద్రి, సయ్యద్ సమీరుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

● గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేస్తున్న ప్రభుత్వం తమదేనని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక 23వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సి.క్యాంప్ క్వార్టర్స్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. అలాగే గుర్తించిన స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసినట్లు చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి పేద కుటుంబానికి మేలు జరిగినట్లు చెప్పారు. గతంలో కేవలం తెలుగుదేశం పార్టీ నాయకులకు పథకాలు అందేవన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అలాంటి పరిస్థితి లేదని, అర్హతే ప్రామాణికంగా పథకాలు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుచితరాణి, సునీల్, ఏసన్న, గిరిధర్, ప్రవీణ్, బలరాం, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకులు ఉపాధ్యాయులు


ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్, మేయర్ బీవై రామయ్య తదితరులు

కర్నూలు సిటీ: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకులు ఉపాధ్యాయులు అని వక్తలు అన్నారు. జిల్లాలోని అన్–ఎయిడెడ్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ఆదివారం ఏపీ అన్ ఎయిడెడ్ స్కూళ్ల యాజమాన్యాల సంఘం (అపుస్మ) ఆధ్వర్యంలో సన్మానించారు. నగరంలోని ఓ స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ డా.సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కర్నూలు మేయర్ బీవై రామయ్య, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించి మాట్లాడారు. ఉపాధ్యాయ వృతి ఎంతో గొప్పదన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో సమానంగా ప్రైవేటు స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులు కూడా పని చేస్తూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం అపుస్మ వ్యవస్థాపకులు వి.జనార్దన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి విష్ణు ప్రసాద్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. బ్యాంకుల్లో తక్కువ వడ్డీకి టీచర్లకు రుణాలు ఇప్పించాలన్నారు. ఇళ్ల స్థలాలు, ఆరోగ్యకార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకుడు జి. పుల్లయ్య, సాయి సుబ్బయ్య రవీంద్ర స్కూల్ అధినేత పి.బి.వి సుబ్బయ్య, అపుస్మ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవయ్య, నాగరాజు, కర్నూలు నగర అధ్యక్షులు యుగంధర్, నగర కార్యదర్శులు శ్రీనివాసులు, మాధవకృష్ణ, వావిలాల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): జుడో తరహాలో జీ–జుతుస్ నూతన క్రీడ కరాటేలో క్రీడాకారులు రాణించాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని యూకాన్ ప్లాజా ప్రాంగణంలో జీ–జుతుస్ జిల్లా కరాటే సంఘం ఆధ్వర్యంలో కరాటే శిక్షణ తరగతులు, పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జీ–జుతుస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాసిన్ షరీఫ్, జిల్లా సంఘం అధ్యక్షుడు షకీల్, కార్యదర్శి ఖాదర్ బాషా, ప్రైవేటు పీఈటీల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

అత్యుత్తమ క్రీడల్లో విలువిద్య ఒకటి


ప్రతిభ చాటిన క్రీడాకారిణికి ప్రశంసాపత్రం అందజేస్తున్న పారిశ్రామికవేత్త రుషికుమార్

కర్నూలు (టౌన్) : దేశంలోనే అత్యుత్తమ క్రీడల్లో విలువిద్య ఒకటి అని పారిశ్రామిక వేత్త రుషి కుమా ర్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్, జూనియర్ ఆర్చరీ క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూవిలువిద్య క్రీడకు కర్నూలులో మంచి ఆదరణ ఉందన్నారు. సబ్ జూనియర్ స్థాయిల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఏకాగ్రత పెంచే క్రీడల వైపు తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బాపూజీ, విలువిద్య సంఘం అధ్యక్షుడు సూర్యచంద్ర, విలువిద్య సంఘం వ్యవస్థాపకులు నాగరత్నమయ్య,శిక్షకులు భరత్ పాల్గొన్నారు.

మాజీ మంత్రిపై దాడి పిరికిపంద చర్య

కర్నూలు(అర్బన్): మాజీ మంత్రి, పెనుగొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ కాన్వాయ్‌పై బాంబు దాడి పిరికిపంద చర్య అని జిల్లా కురువ సంఘం నేతలు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ అనంతపురం జిల్లా గోరంట్ల మండలంలో పర్యటిస్తున్న శంకర్‌నారాయణ కాన్వాయ్‌పై బాంబు వేశారని, అయితే అదృష్టవశాత్తు పేలకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందన్నారు. ఉన్నత భావాలు, మంచి వ్యక్తిత్వం ఉన్న శంకర్‌నారాయణను రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు పిరికిపందలు బాంబు దాడులు చేయించారని విమర్శించారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు.

సీపీఎం ఉద్యమ శ్రేయోభిలాషి వెంకట్రామిరెడ్డి

కర్నూలు(సెంట్రల్): సీపీఎం ఉద్యమ శ్రేయోభిలాషి కె.వెంకట్రామిరెడ్డి అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం వెంకట్రామిరెడ్డి మరణ వార్తను తెలియగానే ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేవనకొండ మండలం తెర్నేకల్‌లో జన్మించిన వెంకట్రామిరెడ్డి విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారన్నారు. లెక్చరర్‌గా పనిచేస్తూనే జిల్లాలో సీపీఎం ఉద్యమాభివృద్ధికి కృషి చేశారన్నారు.